‘ప్రైవేట్’కు అడ్డుకట్ట పడేనా?

- నేడు నాగర్‌కర్నూల్‌లో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం
- బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర


గగ్గలపల్లి కాటన్‌మిల్లుకు వచ్చిన పత్తి


గగ్గలపల్లి కొనుగోలు కేంద్రం పనుల్లో నిమగ్నమైన అధికారులు

నాగర్‌కర్నూల్: రెండు సంవత్సరాలుగా సీసీఐ కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తని సీసీఐ అధికారులు ఈ సంవత్సరం తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 15 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసేలా ప్రణాళికలు వేశారు. 2022, 2023 సంవత్సరాల్లో పత్తి కొనుగోళ్లకు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకు రైతులు పత్తిపంటను విక్రయించారు. ప్రస్తుతం ఇస్తున్న మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7020ల కంటే బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర అధికంగా ఉంది. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. బహిరంగ మార్కెట్‌లో రూ.10 వేల వరకు ధర పలక నుండటంతో రైతులు బయటి మార్కెట్‌లోనే అమ్మేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం సాకుగా చూపి రైతులను మోసం చేసిన ఘటనలు ఉండటంతో పత్తిని విక్రయించేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. నాగర్‌కర్నూల్‌లోని గగ్గలపల్లి శ్రీకృష్ణ కాటన్ మిల్ వద్ద బుధవారం పత్తికొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించనున్నారు.

15 కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు..

నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పరిధిలో 17 జిన్నింగ్ మిల్లులు ఉండగా అన్నింట్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. అయితే రెండు మిల్లులకు సంబంధించి లైసెన్స్‌లు రెన్యూవల్ కాకపోవడంతో 15 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో పత్తి 2,24,766 ఎకరాల్లో సాగు చేయగా 28 లక్షల క్వింటాలు దిగుబడి వస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా పత్తిదిగుబడిపై కొంత ప్రభావం చూసే అవకాశం ఉంది. కొనుగోలు కేంద్రాల్లో పత్తి అమ్మే రైతులు పత్తిలో తేమ శాతం 8 నుంచి 12శాతం వరకు ఉండేలా చూసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పత్తికొనుగోళ్లు, చెల్లింపులు, ఇతరత్రా విషయాల్లో పారదర్శకత కోసం రైతుల బ్యాంక్ ఖాతాకు ఆధార్ కార్డుల అనుసంధానం ఉండాలనే నిబంధనను పెట్టారు. పత్తికొనుగోలు సమయం నాటికి రైతులు తమఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసి ఉంటేనే కొనుగోలు చేయనున్నారు.

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి



నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లి శ్రీకృష్ణ కాటన్‌మిల్ వద్ద పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. బుధవారం నుంచి పత్తిని రైతులనుంచి కొనుగోలు చేస్తాం. రైతు ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి ఉండాలి. ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు రూ.7020 మద్దతు ధర చెల్లిస్తుంది.

– బాలమణి, మార్కెటింగ్ ఏడీ

దళితవార్డులో ఎమ్మెల్యే ప్రచారం


పారిశుద్ధ్య పనులు చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు: మండల కేంద్రంలోని దళితవార్డులో మంగళవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి సెంట్రింగ్, పారిశుద్ధ పనులు చేస్తూ ఆకట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు సీఎం కేసీఆర్‌తో ఎంతో కృషి చేస్తున్నారన్నారు. 70 ఏండ్లలో కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, కల్యాణలక్ష్మి, మిషన్‌భగీరథ, మిషన్‌కాకతీయ పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి


కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న తల్లి బిచ్చమ్మ

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ఆయన తల్లి బిచ్చమ్మ పట్టణంలోని 8, 9 వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మరోసారి హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కరోనా కష్టకాలంలో ఎమ్మెల్యే అండగా నిలబడ్డారని పేర్కొన్నారు. ఆమె వెంట నాయకులు ముస్తఫా, ఫయాజ్, విశ్వాస్, సుల్తాన్ తదితరులున్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు

పాన్‌గల్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని ఎంపీ పోతుగంటి రాములు కోరారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు.. తర్వాత అభివృద్ధిని గమనించాలనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డిని మరోమారు గెలిపించాలనే విషయాన్ని విస్తృత్తంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాముయాదవ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.40 వేల విరాళం



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి మంగళవారం దాతలు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కేశమల్ల కృష్ణ రూ.20వేలు, మెండే జంగయ్య, లింగం వెంకటయ్య, కవుల శ్రీనివాస్, కుగుల మల్లేష్‌లు ఒక్కొక్కరు రూ.5వేల చొప్పున విరాళంగా ఇచ్చారు. దాతల సహకారంతో ఉంటే ఆలయాన్ని వేగవంతంగా పూర్తి చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, అయ్యన్న, మల్లేష్, అంజయ్య, బాల్‌రాజ్, వెంకటయ్య, కృష్ణయ్య, మహేష్ ఉన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగుదాం



కల్వకుర్తిరూరల్: ఐకమత్యంతో ముందుకు సాగుదామని ముదిరాజు సంక్షేమ సేవకుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశం ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో సంఘానికి సహకరించే నాయకులకు అండగా నిలుద్దామని నిర్ణయించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి సుధాకర్, విజయభాస్కర్, కరుణాకర్, గోపాల్, శ్రీను, సుధాకర్, యాదగిరి, రాజు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

సాక్షి, నెట్‌వర్క్: కోడేరు మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని మంగళవారం బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు ప్రారంభించారు. అనంతరం మూడో వార్డు సభ్యురాలు, బీఆర్‌ఎస్ నాయకురాలు నిర్మలతో పాటు 20మంది బీజేపీలో చేరారు. అదేవిధంగా కొల్లాపూర్ మండలంలోని కుడికిళ్ల గ్రామానికి చెందిన పలువురు నాయకులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. శేఖర్‌గౌడ్, సాయికృష్ణగౌడ్ ఉన్నారు.

కరాటే విద్యార్థులకు సన్మానం

వెల్దండ: ఇంటర్నేషనల్ తైక్వాండో ఆధ్వర్యంలో ఈనెల 5న హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైరేంజ్ బుక్ ఆఫ్ వర్ల్డ్ రికార్డ్స్‌లో భాగంగా నిర్వహించిన కరాటే పోటీల్లో మండల కేంద్రానికి చెందిన కరాటే విద్యార్థులు ప్రతిభ చాటారు. దీంతో మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు యాదగిరి విద్యార్థులను సన్మానించారు. కరాటే విద్యార్థులు శ్రీజ, కీర్తన, లతికా, కిషోర్, అజయ్, అఖిల్, గణేష్‌తో పాటు మాస్టర్‌చందును పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

సోనియాగాంధీకి రుణపడి ఉందాం

సాక్షి, నెట్‌వర్క్: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి రుణపడి ఉందామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అమ్రాబాద్ మండలంలోని పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు హరినారాయణగౌడ్, శ్రీనివాసులు, నాసరయ్య, సీఎం రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోడేరు: మండలంలోని కొండ్రావుపల్లికి గ్రామానికి చెందిన బక్కన్న అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, కొండ సుధాకర్‌రెడ్డి మంగళవారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హర్షన్న యువసేన ఆధ్వర్యంలో బాధిత కుటుంబసభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

భావితరాలకు మార్గదర్శకులు శాస్త్రవేత్తలు



బిజినేపల్లి: భావితరాలకు మార్గదర్శకులు శాస్త్రవేత్తలేనని గంగారం పాఠశాల హెచ్‌ఎం కొరివి శ్రీధర్ అన్నారు. మంగళవారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 28వ జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సీవీ రామన్ రామన్ సేవలను కొనియాడారు. 1930లో నోబెల్ బహుమతిని అందుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలపై అవగాహన


బిజినేపల్లి మండలం ఏదిరేపల్లిలో ప్రచారం చేస్తున్న కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి/తెలకపల్లి: తిమ్మాజిపేట మండలంలోని ఏదిరేపల్లిలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి మంగళవారం గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. చేతి గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. మండల కేంద్రంలో ఆయన సతీమణి కూచుకుళ్ల సరిత వ్యాపార దుకాణదారులను కలిసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. అంతకుముందు స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు.

అదేవిధంగా తెలకపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కూచుకుళ్ల రాజేష్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ప్రకాష్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, శేఖర్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా డోర్ స్టిక్కర్లు అతికించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని 26 పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్‌ఓలు గురువారం లోగా ఇంటింటికి తిరిగి ఓటర్లకు సంబంధించిన డోర్ స్టిక్కర్లను అంటించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఓటర్లు వారి ఓటుహక్కును స్వచ్ఛందంగా వేయటంతో పాటుగా, ప్రతిఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో పోస్టర్లు, సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేయాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ తర్వాత పోల్‌చిట్టీలను ఓటర్లకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో బీఎల్‌ఓలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రోల్‌ప్లే పోటీలకు పెద్దపల్లి విద్యార్థుల ఎంపిక



కందనూలు: పట్టణంలోని జాతీయోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి రోల్‌ప్లే పోటీల్లో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం కోసం పోషక విలువ లున్న ఆహారం తీసుకోవాలని, మానవ శ్రేయస్సులో పోషక ఆహారం పాత్ర ఎంతో ఉందన్నారు. సెక్టోరల్ అధికారి షర్ఫుద్దీన్ మాట్లాడుతూ ఇంటర్‌నెట్, ప్రసార మాధ్యమాలను సానుకూలంగా వినియోగించుకొని మాదకద్రవ్యాలను దూరంగా పెట్టి జీవితాన్ని సుఖమయం చేసుకోవాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి కారణాలు– నివారణ అంశంపై ప్రదర్శన ఇచ్చిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దపల్లి విద్యార్థులు మొదటి స్థానంలోనూ, కేజీబీవీ కోడేరు విద్యార్థులు రెండోస్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన పెద్దపల్లి విద్యార్థులు గురువారం జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. హెచ్‌ఎం రవి, న్యాయనిర్ణేతలు సురేష్‌బాబు, మురళీధర్ రావు, ఉపాధ్యాయులు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

మహాసభ కరపత్రాల విడుదల



లింగాల: హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదిన నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ సంబంధించిన వాల్ పోస్టర్లను, కరపత్రాలను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బంగారయ్య విడుదల చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, నర్సింహ్మ, అశోక్, విజయ్, నాగరాజు, చంద్రిక, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఇంటింటి ప్రచారం

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్‌కు మద్దతుగా ఆపార్టీ నాయకులు మంగళవారం తెలకపల్లి, తాడూరు మండల కేంద్రాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకర్, కొట్ర బాలు, సృజన, బాలనాగయ్య, మొగులాలు, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అబ్రహం కాదు.. విజయుడికే

● అలంపూర్ ఎమ్మెల్యేకు షాక్

- సిట్టింగ్‌ను కాదనుకొని.. ఎమ్మెల్సీ అనుచరుడికి బీఫాం
- పంతం నెగ్గించుకున్న చల్లా వెంకట్రామిరెడ్డి


రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న విజయుడు

అలంపూర్: బీఆర్‌ఎస్ సిట్టింగ్ అభ్యర్థికి గులాబీ బాస్ షాకిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఆగస్టు 21న సిట్టింగ్ ఎమ్మెల్యేలను అభ్యర్థులుగా ప్రకటించారు. అందులో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహంను అభ్యర్థిగా ప్రకటించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి.. తన అనుచరుడికి టికెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. మారిన రాజకీయ పరిణామాలతో అబ్రహంకు బీఫాం ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడంతో అనిశ్చితికి దారితీసింది. ఎట్టకేలకు ఎమ్మెల్సీ తన పంతాన్ని నెగ్గించుకోవడంతో 20 రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. ఎమ్మెల్యే అబ్రహంను కాదనుకొని ఎమ్మెల్సీ అనుచరుడు విజయుడికి బీఫాం దక్కింది. మంగళవారం హైదరాబాద్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా విజయుడు బీఫాం అందుకున్నారు.

నీటి వసతి ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


ట్యాంకర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

తాడూరు: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీరోడ్డు తాడూరు, ఎండబెట్ల సమీపంలో ఉన్న రెండు కల్వర్టుల వద్ద పది రోజుల కిందట సీసీ రోడ్డును నిర్మించారు. కాని సరైన నీటి వసతి ఏర్పాటు చేయకుండా వదిలేశారు. అధికారుల నిర్లక్ష్యం శీర్షిక పేరుతో సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితం అయ్యింది. దీంతో అధికారులు స్పందించి మంగళవారం ట్యాంకర్ ద్వారా నీటిని వసతి కల్పించారు. కల్వర్టు రోడ్డుపై వేసిన సీసీ రోడ్డుపై నీటిని పోశారు.

బాధ్యతగా ఓటు వేయాలి


ఓటు అవగాహన రథాన్ని ప్రారంభిస్తున్న రిటర్నింగ్ అధికారి శ్రీను

కల్వకుర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని కల్వకుర్తి రిటర్నింగ్ అధికారి శ్రీను అన్నారు. మంగళవారం రిటర్నింగ్ కార్యాలయం ఆవరణలో ఓటు అవగాహన రథాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఓటుతో ప్రజల భవిష్యత్తును మార్చేందుకు వీలుపడుతుందన్నారు. ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పోలింగ్ తేదీ వరకు అవగాహన రథం నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు తిరుగుతుందన్నారు. పోలింగ్ రోజున అత్యధికంగా ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేందర్, ఎలక్షన్ డీటీ అనిత, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ప్యానల్ బృందం



లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను మంగళవారం హెచ్‌ఎం శేఖర్ ఆధ్వర్యంలో ప్యానల్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు పాఠశాల, కళాశాలకు చెందిన 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన వివిధ రకాల రికార్డులతో పాటు తరగతి గదులను పరిశీలించారు. బోధనను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రిన్సిపాల్ బాలస్వామి వారిని సన్మానించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు శ్రీనివాసులు, అరవింద్, వెంకట్‌రాజు, శంకరయ్య, శ్రీను, నిరంజన్, చంప్లీ, పీడీ వెంకటేశ్వర్లు, స్వరూప, వైస్ ప్రిన్సిపాల్ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ ఫీజులను చెల్లించాలి

కల్వకుర్తి టౌన్: దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాల ఏర్పాటుచేసే వారు విధిగా వారు ట్రేడ్‌లైసెన్స్ ఫీజులను చెల్లించాలని బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ గ్రౌండ్‌లో దుకాణాలను ఏర్పాటు చేయాలని కోరారు.

స్కౌట్‌తో నైతిక విలువలు మెరుగు



కందనూలు: స్కౌట్ అండ్ గైడ్స్‌తో దేశభక్తితో పాటు నైతిక విలువలు పెంపొందుతాయని హెచ్‌ఎం లత అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 74వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెడెన్ పావెల్ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్కౌట్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉపన్యాస, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన స్కౌట్ విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. స్కౌట్ మాస్టర్ సురేష్ బాబు వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యాం సుందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, తిరుపతయ్య, జహరుద్దీన్, అరుణాదేవి, పద్మావతి, భీమమ్మ, శేఖర్ బాబు, హనుమంత్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

సాక్షి, నెట్‌వర్క్: ఊర్కొండ మండల కేంద్రంలో మంగళవారం జడ్చర్ల కాంగ్రెస్ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో ఊర్కొండపేట మాజీ సర్పంచ్ చిత్తనూరి ప్రకాష్‌గుప్తా, గ్రామ రైతు సమన్వయ అధ్యక్షుడు సుక్కపురం అంజయ్యగౌడ్, దేవాలయ మాజీ ధర్మకర్త గోవర్ధన్ కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా తాగూర్‌తండాకు చెందిన 50 మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బల్మూరు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్యతో పాటు మరో 100 నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.